


స్వచ్ఛ సర్వేక్షన్లో తిరుపతికి జాతీయ అవార్డు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్‌కి స్వచ్ఛ సర్వేక్షన్ 2023 లో భాగంగా జాతీయస్థాయిలో అవార్డ్ దక్కిందని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11వ తేది డిల్లీలో జరిగే కార్యక్రమంలో అవార్డ్ అందుకుంటామన్నారు. ఈ అవార్డ్ రావడానికి ముఖ్యంగా తిరుపతి నగర ప్రజల సహకారం ఎంతో ఉపయోగ పడిందని, మరోవైపు మునిసిపల్ కార్పొరేషన్ శానిటేషన్ సిబ్బంది పని తీరు వలన, ఇంకో వైపు కౌన్సిల్ సహకారం వలన, అదేవిధంగా నగరపాలక సంస్థ సిబ్బంది, అధికారుల సహకారంతో ముందుకు వెళ్లడం జరిగిందని, వీరందరికి ప్రత్యేక అభినందనలని కమిషనర్ హరిత తెలిపారు.



'బై' జూస్.. 'వై' యూజ్.!

- 'బజాజ్'తో కలిసి కోట్లల్లో బురిడీ
- లాప్‌టాప్, ట్యాబ్‌లంటూ మోసం
- తిరుపతిలోనే వెయ్యిమంది బాధితులు

ప్రజాశక్తి - తిరుపతి

" ప్రస్తుతం ప్రైవేటు యూజర్లకు రూ. 20 వేల నుంచి 25 వేలు చెల్లిస్తే అందిస్తున్న బైజూస్ కంటెంట్, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్నాం. తద్వారా ప్రైవేటు బడుల్లో చదువుతున్న పిల్లలతో సమానంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఎదుగుతారని, ఈ సంస్థ తో ఒప్పందం ఒక గేమ్ చేంజర్" అని రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రశంసల వర్షం కురిపిస్తున్న " బైజూస్ " సంస్థ నిర్వాహకుడు రవీంద్ర తీరు తీవ్ర దుమారం లేపుతోంది. పేద, మధ్యతరగతి విద్యార్థులే టార్గెట్ గా తిరుపతి , పరిసర ప్రాంతాల విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు చేసి... ' మీ పిల్లలు ఉన్నత స్థానానికి ఎదగాలంటే ఉత్తమమైన విద్యను అందించాలి. అందుకే అత్యుత్తమ, జాతీయ స్థాయి లో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో అత్యాధునిక పద్ధతిలో లైవ్ క్లాసులను నిర్వహిస్తున్నాం. మీ పిల్లలు డాక్టర్లు, ఇంజనీర్లు, కలెక్టర్లు, ఉన్నత పోలీసు అధికారులు గానో ఎదగాలంటే మా ఈ బైజుస్ ద్వారా అందిస్తున్న కంటెంట్ ఎంతగానో ఉపయోగపడుతుంది. పెద్ద పెద్ద కార్పొరేట్ విద్యాసంస్థల్లో చెబుతున్న తరహాలోనే అతి తక్కువ ధరలకే మీకు బైజుస్ కంటెంట్ ను అందిస్తున్నాం. మా కంటెంట్ ఒక్కసారి వింటే చాలు...పిల్లల మదిలో అతి సులభంగా పాఠాలు నిలిచిపోతాయి. లాప్టాప్ , టాబ్ మేమే ఏర్పాటు చేస్తాం . పైగా ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం కూడా మా కంటెంట్ ను కొని ప్రభుత్వ బడుల్లో చదువుతున్న పిల్లలకు అందిస్తోంది అంటే మా నాణ్యత ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. అందుకే మీరు ఒకసారి తిరుపతి లోని మా ఆఫీస్కు రండి' అంటూ ఆశపెడుతున్నారు. వచ్చాక...ఒక లక్ష నుంచి మొదలెట్టి 70 నుంచి 60 వేలకు విద్యార్థుల తల్లిదండ్రులను ఒప్పిస్తున్నారు. పైగా బజాజ్ ఫైనాన్స్ తో జతకట్టి ఫీజు చెల్లించేందుకు ఈఎంఐ సౌకర్యాలనూ వారే కల్పించడం గమనార్హం. వీటితో పాటు లాప్టాప్ , ట్యాబ్లను బలవంతంగా విద్యార్థులతో కొనిస్తున్నారు. ఇలా ఒక్క తిరుపతి నగరంలోనే 1000 మందికి పైగా వసూలు చేసినట్లు ప్రజాసంఘాల నాయకులు పేర్కొంటున్నారు. ఇలా ఇప్పటికే 70 కోట్లకు పైగా తిరుపతిలో వసూలు చేసినట్లు విద్యార్థి సంఘాల నేతల విమర్శలు.

ప్రీ రికార్డింగ్ వీడియోలతో బురిడీ

కంటెంట్ను లైవ్ లో ఇస్తామని హామీ ఇచ్చిన బైజుస్ నిర్వాహకులు తీరా ప్రీ రికార్డింగ్ వీడియోలను రోజుకు గంట నుంచి రెండు గంటల పాటు ఇస్తున్నారన్న విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. ఇదేంటని ప్రశ్నిస్తే వారిని నిర్వాహకులు బెదిరిస్తున్నారని బాధితులు వాపోతున్నారు. ఇదే విషయమై బైజుస్ యాజమాన్యాన్ని నిలదీసిన ఏడుమంది విద్యార్థిసంఘాల నాయకులపై తిరుపతి అలిపిరి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసేందుకూ వెనకాడకపోవడం గమనార్హం.

రవీంద్రపై చర్యలు తీసుకోవాలి : పి మురళి ,సీపీఐ జిల్లా కార్యదర్శి



బైజుస్ కంటెంట్ పేరుతో పేద మధ్యతరగతి వర్గాల విద్యార్థులను మభ్యపెట్టి గోల్మాల్కు పాల్పడుతున్న బైజుస్ రవీంద్ర పై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి. తిరుపతి నగరం తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా కోట్లాది రూపాయల స్కాంకు పాల్పడుతున్న బైజుస్ యాజమాన్యంపై రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి ఎందుకు అంత ప్రేమో అర్థం కావడం లేదు. నాసిరకం ట్యాబ్లు, లాప్టాప్ లంటూ ఇప్పటికే వందల కోట్ల రూపాయలను ప్రభుత్వం దుర్వినియోగం చేసింది. ప్రశ్నించిన వారిపై కేసులు పెడుతోంది.

బైజూస్ కంటే ఉపాధ్యాయులే ఎన్నో రెట్లు మేలు : అవనిగడ్డ పద్మజ, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి



బైజుస్ కంటే ఉపాధ్యాయులే ఎన్నో రెట్లు మేలు. ఈ విషయాన్ని ప్రభుత్వం ఇప్పటికైనా గుర్తించాలి. డిజిటల్ కంటెంట్ ఇస్తున్నామని గొప్పలు చెప్పుకోవడం తప్ప అందువల్ల ఉత్పన్నవుతున్న సమస్యల్ని పట్టించుకోవడం లేదు. కోట్లాది రూపాయల స్కాం కు పాల్పడుతున్న బైజ్యూస్ సంస్థ పై చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం, ఆ సంస్థను వెనకేసుకు రావడం లో ఆంతర్యం ఎంటో అనే అనుమానాలు అందరిలో వ్యక్తమవుతున్నాయి.



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఐలు జిల్లా నాయకులు చల్లా వెంకటయ్య

'మనువాదుల' చేతిలో 'దేశం'

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

భారత రాజ్యాంగం ప్రమాదంలో ఉందని, మనువాదుల నుంచి కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, మతోన్మాద బిజెపిని ఓడించి దేశాన్ని కాపాడుకోవాలని వక్తలు ఉద్ఘాటించారు. భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం యశోద నగర్ లోని వేమన విజ్ఞాన కేంద్రంలో 'మతోన్మాద బిజెపిని ఓడిద్దాం.. దేశాన్ని కాపాడుకుందాం' అనే అంశం మీద నగరంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీలు, మేధావులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి 'ఐలు' జిల్లా నాయకులు చల్లా వెంకటయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయులు రాఘవ శర్మ, భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ పి అంజయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రమాదంలో పడిందని, పది సంవత్సరాలుగా చాలా తీవ్రమైన ప్రమాదాన్ని ప్రజలు ఎదుర్కొంటున్నారనీ, భావ ప్రకటన స్వేచ్ఛను తుంగలో తొక్కుతున్నారని ఆరోపించారు.

భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

అందులో భాగంగానే పత్రికా స్వేచ్ఛను హరిస్తున్నారన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి ప్రమాదం ఉప్పెనలా వస్తుందని,ఇటీవల జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే భయం వేస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. బిజెపి మతం పేరుతోనూ, దేవుడి పేరుతోనూ, తాము చెప్పిందే శాసనం అన్నట్లుగా వ్యవహరిస్తోందన్నారు. నరేంద్రమోడీ గుజరాత్ సిఎంగా ఉన్నపుడు రెండువేల మంది ముస్లీంలను ఊచకోత కోశాడని, ప్రధాని అయ్యాక కార్మిక, రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్నాడని మండిపడ్డారు. ఒలంపిక్స్‌లోనూ మతోన్మాదం కాలు పెట్టడం వల్ల రెజ్లర్లు సైతం తమకు ఈ మెడల్స్ వద్దంటూ గంగలో వేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు చిన్నం పెంచలయ్య, బిఆర్ఎస్ నాయకులు ఆర్కాట్‌కృష్ణప్రసాద్, ఆమ్‌ఆద్మీ పార్టీ బెల్లంకొండ సురేష్, విసికె నాయకులు రమేష్, రచయిత గొడుగు చింతల గోవిందయ్య, డిఎంసి భాస్కర్ పాల్గొన్నారు.



వరిలో జింకు లోపాన్ని నివారించండి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

వరిలో జింక్ లోపాన్ని నివారించాల్సిన అవసరం ఉందని తిరుపతి జిల్లా వ్యవసాయ శాఖ వనరుల కేంద్రం ఏ డి ఏ మెరుగు భాస్కరయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చలి వాతావరణంలో రబీలో జింకు లోపం ఎక్కువగా కనిపిస్తుందని, సున్నం, చౌడు భూముల్లో భాస్కరం ఎక్కువగా ఉన్న భూముల్లో జింకు మొక్కలకు సరిగా అందదని తెలిపారు. నాటిన 2-6 వారాల మధ్య కనిపిస్తుందని, ఆకుల మధ్య భాగం పసుపు రంగుకు మారుతుందన్నారు. మురుగునీరు పోని పొలాల్లో పాత నీరు పూర్తిగా తీసేసి, కొత్త నీరు పెట్టాలి. చౌడు పొలాలోల పైపాటుగా వేసే యూరియాకు బదులు అమోనియం సల్ఫేట్ వేయాలి. పైరులో జింకు లోప లక్షణాలు కనిపిస్తే లీటరు నీటికీ 2 గ్రా. జింకు సల్ఫేట్, 5 గ్రా. యూరియా వారం రోజులు వ్యవధిలో 2 సార్లు స్ప్రే చేయాలి. చిలేటెడ్ రూపంలో మార్కెట్లో దొరికే చిలామినిన్ జింకును లీటరు నీటికి 1 గ్రా. చొప్పున కలిపి అవసరాన్ని బట్టి 1-2 సార్లు స్ప్రే చేస్తే మంచి ఫలితాలు వస్తాయి.

టిడిపి వస్తే కబ్జాకోరులు జైలుకే : బొజ్జల సుధీర్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

జూనియర్ బాలికల కళాశాల వద్ద నిరసన



అధికార పార్టీ కబ్జాల పర్వాన్ని ఇంకెన్నాళ్ళో కొనసాగనీయబోమనీ, తాము అధికారంలోకి వస్తే అందర్నీ జైలుకు పంపుతామని శ్రీకాళహస్తి టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి బొజ్జల సుధీర్ రెడ్డి హెచ్చరించారు. పట్టణ శివారులోని తొట్టంబేడు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల స్థలం ఆక్రమణలను వ్యతిరేకిస్తూ శుక్రవారం కళాశాల ప్రాంగణం సమీపంలో టీడీపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తిలో రౌడీయిజానికి, అరాచకాలకు, కబ్జాలకు మరొక పరాకాష్ట బాలికల జూనియర్ కళాశాల స్థలం ఆక్రమించడమని ఉదహరించారు. ఈ బాలికల జూనియర్ కళాశాల 6.67ఎకరాల విస్తీర్ణంలో ఉందన్నారు. ఇందులో చాలా భాగం ఆక్రమణకు గురైందన్నారు. 2018లో తన తండ్రి బొజ్జల గోపాలకష్ణారెడ్డి శాసనసభ్యులుగా ఉన్నపుడు కళాశాల స్థలం కాపాడుకోవాలనే ఆశయంతో ప్రహరీ నిర్మాణం కోసం రూ.2కోట్లు మంజూరు చేయించారన్నారు. ఆ నిధులతో ప్రహరీ నిర్మాణ పనులు అప్పట్లో ప్రారంభించారన్నారు. అయితే 2019లో జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఓడి పోవడం, వైసీపీ అధికారంలోకి రావడంతో అధికార పార్టీ నాయకులు కమీషను కోసం కాంట్రాక్టరును బెదిరించి ప్రహరీ నిర్మాణ పనులు ఆపేశారన్నారు. ప్రహరీ నిర్మాణం కోసం టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు ప్రస్తుతం ఉండేది నమ్మకం లేదన్నారు. ఆ నిధులు కూడా అధికార పార్టీ నేతలు కాజేసి ఉండవచ్చన్న అనుమానం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఈ కళాశాల స్థలాన్ని ఎంఎల్ఏ అనుచరులని చెప్పుకుంటున్న ఇద్దరు కీలక నాయకులు ఆక్రమించడానికి పథకం రచించి చదును చేశారన్నారు. కళాశాల స్థలంలో ఎకరా స్థలం కబ్జా చేయడానికి ముహూర్తం పెట్టుకున్నారని ఆయన ఆరోపించారు. నేతలు విజయ్ కుమార్ నాయుడు, మిన్నల్ రవి, గుమ్మిడిపూడి దశరధాచారి, పోలూరు శ్రీనివాసులు రెడ్డి, కాసరం రమేష్, కన్నానవరం హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ ట్రస్టులకు రూ. 40 లక్షలు విరాళం

ప్రజాశక్తి - తిరుమల

టీటీడీలోని పలు ట్రస్టులకు శుక్రవారం రూ.40 లక్షలు విరాళంగా అందింది. హైదరాబాదుకు చెందిన కె.వి రాజశేఖర్‌కు చెందిన జెకెసి ప్రాజెక్ట్సు లిమిటెడ్ సంస్థ ఎస్వీబీసీ ట్రస్టుకు రూ.10 లక్షలు, కొల్లి గోపాలకష్ణ అన్నదానం ట్రస్టుకు రూ.10 లక్షలు,కొల్లి మాధవ అన్నదానం ట్రస్టుకు రూ.10 లక్షలు, ఢిల్లీకి చెందిన శివంగ్ కౌర్ బర్ద్ ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళంగా అందించారు. దాతల ప్రతినిధులు వి.మణిరెడ్డి, తిరుపతికి చెందిన వై.రాఘవేంద్ర కలిసి విరాళం డిడిలను తిరుమల అన్నమయ్య భవనంలో టీటీడీ ఈవో ఏవి.ధర్మారెడ్డికి అందజేశారు.

శ్రీవారి సేవలో జాన్వీకపూర్



ప్రజాశక్తి - తిరుమల

శ్రీదేవి కూతురు, బాలీవుడు బ్యూటీ జాన్వీకపూర్ తిరుమల శ్రీవారిని గురువారం దర్శించుకున్నారు. సమీప బంధువు, మరో నటి మహేశ్వరితో కలిసి శ్రీవారి బ్రేక్ దర్శన సమయంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు ఆమెకు స్వాగతం పలికారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వారికి ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. జాన్వీకపూర్ ప్రస్తుతం తెలుగులో 'దేవర' సినిమాలో జూనియర్ ఎన్టీఆర్ సరసన నటిస్తున్నారు.

క్రాంతి జ్యోతి..సావిత్రిబాయి

ప్రజాశక్తి-సూళ్లూరుపేట

'క్రాంతి జ్యోతి సావిత్రిబాయి పూలే మహిళలందరికీ ఆదర్శం' అని వక్తలు ఉద్ఘాటించారు. ఉపాధ్యాయరంగానికి ఆమె చేసిన సేవలు ఆదర్శప్రయమన్నారు. జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ తడ,దొరవారిసత్రం, సూళ్లూరుపేట మండల శాఖల ఆధ్వర్యంలో యుటిఎఫ్ జిల్లా మహిళా కమిటీ కన్వీనర్ కే.ఎం.ఎస్ సునీల అధ్యక్షతన ప్రభుత్వ ఉన్నత పాఠశాల సూళ్లూరుపేట నందు సమావేశం జరిగింది. ఈ సమావేశానికి వచ్చిన వక్తలు అందరూ సావిత్రిబాయి పూలే భారతదేశం యొక్క మొదటి మహిళ ఉపాధ్యాయునిగా, ఎన్నో సామాజిక సేవలను చేసి, బాలికా విద్యను బలోపేతం చేసి, సమాజంలో మహిళల పట్ల వ్యవహరిస్తున్న మూఢ నమ్మకాలను అరికట్టి, ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు అని ప్రపంచానికి చాటి చెప్పిందని కొనియాడారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా తిరుపతి యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి అవనిగడ్డ పద్మజ ప్రస్తుత సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్నటువంటి సమస్యలను సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని పిలుపు నిచ్చారు. పాణ్యం ఉష మాధవిలత, భూసం విజయమ్మ, జి.ఝాన్సీబాయ్, కె.ధనలక్ష్మి, బందెల స్వర్ణలత,గన్నవరం సరస్వతిలను ఉత్తమ మహిళా ఉపాధ్యాయులుగా గుర్తించి సత్కరించారు. ఈ సమావేశంలో సూళ్లూరుపేట ఎంపిడిఓ మురళికృష్ణ, మండల విద్యాశాఖాధికారి కాపులూరు శ్రీనివాసులు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జిజె రాజశేఖర్, పూర్వ రాష్ట్రకార్యదర్శి చెంగాని చంద్రశేఖర్, గౌరవాధ్యక్షులు కె.శేఖర్, జిల్లా కార్యదర్శి కావూరు ప్రభాకర్, కమిటీ కన్వీనర్ ఎస్.బాబు పాల్గొన్నారు.



యూటిఎఫ్ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులకు చిరు సన్మానం

'పట్టు'వీడని అంగన్‌వాడీలు

మెడికల్‌రెప్స్, 108, 104 ఉద్యోగుల మద్దతు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, యంత్రాంగం

అంగన్‌వాడీలకు వేతనాలు పెంచితే విధుల్లోకి వస్తామని అంగన్‌వాడీలు పట్టుబట్టి చేస్తున్న సమ్మె 25వ రోజుకు చేరుకుంది. తిరుపతి పాత కార్పొరేషన్ కార్యాలయం వద్ద సమ్మెకు మెడికల్ రెప్స్, 108, 104 ఉద్యోగులు మద్దతు తెలిపారు.మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి టి.రామకృష్ణ బృందం మద్దతు ప్రకటించింది. అంగన్‌వాడీ కార్మికులకు కమలాపండ్లను అందించారు. రావణరాష్ట్రంలా మారుస్తున్న జగన్మోహన్‌రెడ్డి తన వైఖరి మార్చుకోవాలన్నారు. అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. మెడికల్ రెప్స్ బృందం ఆనంద్, శ్రీనివాసులు, రాజేష్, నాగరాజు, విజయ్, మునిరాజా, అంగన్‌వాడీలు నాగరాజమ్మ, జయప్రభ, ఎల్లమ్మ, గీత, సుజిత, సుశీల, వెంకటలక్ష్మి, వరలక్ష్మి, గంగాదేవి పాల్గొన్నారు.

- గూడూరు టౌన్‌లో యూనియన్ నాయకురాలు వనజాక్షి ఆధ్వర్యంలో సమ్మె కొనసాగుతోంది. శిబిరంలో గొబ్బెమ్మలు పెట్టి గొబ్బి పాటలు పాడుతూ నిరసన తెలిపారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆహార ప్యాకెట్లను అందజేశారు. డిమాండ్ల పరిష్కారం అయ్యేవరకూ ఎన్ని రోజులైనా సమ్మెను కొనసాగిస్తామన్నారు.శివకుమార్, రమణయ్య, గోపి, హెప్సిబా, జెవివి సభ్యులు రామ్మోమన్‌రావు, పురుషోత్తం, శ్రీనివాసులు పాల్గొన్నారు.
- సూళ్లూరుపేటలో రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందని, ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని అంగన్‌వాడీ జిల్లా నాయకురాలు మేకల హైమావతి హెచ్చరించారు. తహశీల్దార్ కార్యాలయం నుంచి చెంగాలమ్మ గుడి వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. సిఐటియు కార్యదర్శి కె.లక్ష్మయ్య పాల్గొన్నారు.
- పిచ్చాటూరులో పిచ్చాటూరు, నాగలాపురం, కెవిబిపురం, నారాయణవనం మండలాల అంగన్‌వాడీలు సమ్మె కొనసాగించారు. గ్రామీణ, మండల ప్రాంతాల్లో పిల్లల మధ్య ఉండే తమను వీధుల పాలు చేసిన ఘనత జగన్మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. 25 రోజులుగా ఇంటికి, విద్యార్థులకు దూరమై సమ్మెలో ఉంటున్నామని, అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలుపుతున్నా, జగన్మోహన్‌రెడ్డి నుంచి ఏమాత్రం స్పందన లేదని వాపోయారు. శ్రీవాణి, గ్లోరీ, అముద, భారతి, సఖియా, కృష్ణవేణి పాల్గొన్నారు.
- పుత్తూరు టౌన్‌లో ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు విజయకుమారి, మునికుమారి ఆధ్వర్యంలో సమ్మె కొనసాగింది. ఆశా వర్కర్స్‌మద్దతు ప్రకటించింది.
- బిఎన్‌కండ్రిగలో ఎంఎల్ఎను అంగన్‌వాడీలు అడ్డగించారు. మండల పరిషత్‌కార్యాలయంలో కొత్తగా మంజూరైన పెన్షన్లు పంపిణీ చేయడానికి ఎంఎల్ఏ రాగా అడ్డుకున్నారు. తాము 25 రోజులుగా సమ్మెచేస్తున్నా పట్టించుకోలేదని, తమను ఉద్యోగంనుంచి తొలగిస్తామని అధికారులు ప్రకటించడం దారుణమని ఎంఎల్ఏకు వినతిపత్రం ఇచ్చారు. సిఎం దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు.
- కోటలో మండల కార్యదర్శి పద్మలీలమ్మ, సరోజిని ఆధ్వర్యంలో సమ్మె ఉధృతంగా కొనసాగింది.





పాలకులకు చె(చి)త్త 'శుద్ధి' ఏది..?

పేరుకుపోయిన చెత్తకుప్పలు / సమ్మె డిమాండ్లు నెరవేర్చని సిఎం

శ్రద్ధంతా పోటీ కార్మికులపైనే.. / పారిశుధ్య కార్మికుల అలుపెరుగని పోరాటం

ప్రజాశక్తి - గూడూరు/ సూళ్లూరుపేట

వైసిపి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నది వాస్తవం.. గత 11 రోజులుగా మున్సిపల్ పారిశుధ్య కార్మికులు సమ్మె చేస్తుంటే వారి డిమాండ్ల పరిష్కారానికి కృషి చేయాల్సిన సిఎం జగన్మోహన్‌రెడ్డి రెచ్చగొట్టే ధోరణిలో వ్యవహరించడం గమనార్హం. మున్సిపల్ కమిషనర్, ఛైర్మన్‌లు పారిశుధ్య కార్మికుల పొట్టగొట్టేలా పోటీ కార్మికులను రంగంలోకి తెచ్చి సమ్మె విచ్ఛిన్నానికి పూనుకున్నారు. అయితే పారిశుధ్య కార్మికులు తమ పొట్టగొట్టే చర్యలకు పాల్పడవద్దని, సమ్మె డిమాండ్ల పరిష్కారానికి కృషి చేయాలని 'పట్టు' బిగిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే గురువారం సూళ్లూరుపేటలో ఐదుగురిపై బైండోవర్ కేసులు పెట్టారు. అయినా సమ్మె విరమించేది లేదని, ప్రభుత్వ బెదిరింపులకు వెనక్కి తగ్గేది లేదని పారిశుధ్య కార్మికులు సమ్మెను కొనసాగిస్తున్నారు. అయితే జిల్లాలోని మున్సిపాలిటీల్లోనూ, తిరుపతి కార్పొరేషన్‌లోనూ చెత్త ఎక్కడబడితే అక్కడ కుప్పలు కుప్పలుగా ఉంది. పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. దోమలకు నిలయంగా మారింది. ఓ వైపు జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో ఈ 'చెత్త' దిబ్బల వల్ల ఎక్కడ రోగాలు ఎక్కువవుతాయోనని జనం వాపోతున్నారు. మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది సమస్యలు పరిష్కరించి, వీధుల్లో చెత్త లేకుండా చేయాల్సి ఉంది. తమ డిమాండ్లు పరిష్కరిస్తే వెనువెంటనే చెత్త దిబ్బలన్నీ శుభ్రం చేస్తామని కార్మికులు స్పష్టం చేస్తున్నారు.

డిమాండ్లు పరిష్కరిస్తేనే సమ్మె విరమణ - బి గోపీనాథ్, మున్సిపల్ సంఘం తిరుపతి జిల్లా కార్యదర్శి



ఈ వీధి, ఆ వీధి అనే తేడా లేకుండా ఎక్కడ చూసినా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. డ్రైనేజి కాల్వలు శుభ్రం చేయకపోవడంతో పూడిక పేరుకుపోయి దోమల బెడద అధికంగా ఉంది. సమ్మెలో ఉన్న పారిశుధ్య కార్మికులు మున్సిపల్ కార్యాలయం ఎదుట రిలే దీక్షలను కొనసాగిస్తున్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నది వారి ప్రధాన డిమాండ్లు. సమ్మె విరమింపజేయాల్సిన ప్రభుత్వం రెగ్యులర్ కార్మికులతో చెత్తను డంపింగ్ యార్డుకు తరలించే ప్రయత్నం చేయగా సిఐటియు ఆధ్వర్యంలో లారీలను అడ్డుకున్నారు. గూడూరు మున్సిపాలిటీలో మొత్తం 203 మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య సిబ్బంది ఉన్నారు. వీరంతా సమ్మె చేస్తున్నారు. 32 మంది రెగ్యులర్ కార్మికులు మాత్రమే పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నారు. పట్టణంలో రోజూ సుమారు 70 టన్నుల చెత్తను సేకరించి డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నారు. ఇంటింట చెత్త సేకరణ నిలిచిపోయింది. వీరంతా వీధుల్లో తీసుకొచ్చి పడుస్తుండడంతో చెత్తదిబ్బలు పేరుకుపోయాయి.

అలుపెరుగని పోరాటం : కె.సాంబశివయ్య, బి.పద్మనాభయ్య, సిహెచ్ సుధాకర్‌రావు

ప్రతిపక్షంలో ఉన్నపుడు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక నెరవేర్చమని కోరడమే మేం చేస్తున్నాం. మేమేమీ గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదు. కనీస వేతనం రూ.26వేలను మున్సిపల్ కార్మికులకు ఇవ్వలేకపోతున్నారు. కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 123 మున్సిపాలిటీల్లో 40వేల మంది ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు మున్సిపల్ కార్మికులు 11 రోజుల నుంచి సమ్మె చేస్తున్నారు. శాంతియుతంగా సమ్మెచేస్తుంటే, అధికార పక్షం సమ్మెను నీరుగార్చేలా చేయడం, పోలీసుల సాయంతో పోటీ కార్మికులను పనుల్లోకి పెట్టి వారి మధ్య గొడవలు పెట్టడం చేస్తోంది. బైండోవర్ కేసులు పెట్టడం ప్రభుత్వ నియంతృత్వానికి పరాకాష్టగా ఉంది.

కుటుంబ పోషణ కష్టంగా ఉంది : ప్రసాద్, కార్మికుడు





వాహనాలు వెళ్లకుండా మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావును అడ్డుకున్న కార్మికులు

ప్రభుత్వం మొండిగా వ్యవహరించడమే కాకుండా, పోటీ కార్మికులతో మా పొట్ట గొట్టే ప్రయత్నం చేస్తోంది. కొద్దిమంది తాత్కాలిక కూలీలను పెట్టి పనులు చేసేందుకు ప్రయత్నించారు. వాహనాలను అడ్డుకోవడంతో అధికారులు వెనక్కి తగ్గారు. సమ్మెచేయడం, ప్రజలను ఇబ్బంది పెట్టడం మాకేం సంతోషం కాదు. చాలీచాలని జీతాలతో ఎన్నాళ్లని గడిపేది. నెలనెలా జీతాలు ఇవ్వకపోవడంతో కుటుంబ పోషణ కష్టమవుతోంది. జీతం చాలకపోవడంతో వడ్డీలకు అప్పులు తేవడం, సగం జీతం వడ్డీలకే సరిపోవడం వల్ల బతుకు దుర్భరంగా మారుతోంది. న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలి.

జగన్‌ను నమ్మితే చెవిలో పువ్వే

పుత్తూరు టౌన్ : జగన్‌ను నమ్మితే చెవిలోపువ్వుపెడతారని మున్సిపల్ కార్మికులు వినూత్నంగా నిరసన తెలిపారు. అంబేద్కర్ సర్కిల్ వరకూ చెవిలో పువ్వుతూ నిరసన తెలిపారు. యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు డి.మహేష్ మాట్లాడుతూ సమ్మె చేయడానికి రాష్ట్ర ప్రభుత్వమే ప్రధాన కారణమన్నారు. జనసేన నాయకులు గోపిరాయల్ మద్దతు తెలిపారు.


భవన నిర్మాణ కార్మికుడికి బీమా సాయం అందిస్తున్న లైఫ్ స్టీల్ సంస్థ

భవన నిర్మాణ కార్మికుడికి ప్రమాద బీమా అందజేత

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి: ఆరు నెలల క్రితం చోటుచేసుకున్న ఓ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న భవన నిర్మాణ రంగ కార్మికుడు గంగాధర్ కు ఎమ్మెస్ లైఫ్ స్టీల్ సంస్థ శుక్రవారం ప్రమాద బీమా అందజేసింది. తొట్టంబేడు మండలం శేషమ నాయుడుకండ్రిగ గ్రామానికి చెందిన గంగాధర్(55) 30 ఏళ్లుగా తాపీ మేస్త్రిగా పనిచేస్తున్నాడు. ఆరు నెలల క్రితం శ్రీకాళహస్తి పట్టణంలోని వీఎంపల్లి సమీపంలో రోడ్డు దాటుతుండగా ఆర్టీసీ బస్సు ఢీకొని ప్రమాదంలో గంగాధర్ కుడి కాలుకు తీవ్ర గాయమై మంచానికే పరి మితమయ్యాడు. దీంతో ఎమ్మెస్ లైఫ్ సంస్థ ప్రతినిధులు స్థానిక హిందుస్థాన్ స్టీల్ అండ్ సిమెంట్ డీలర్ అండ్ ప్రొప్రైటర్ షేక్ ఇలియాస్ బాబు సమక్షంలో గంగాధర్‌కు రూ.30 వేలు ప్రమాద బీమా చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్ లైఫ్ స్టీల్ ప్రతినిధులు శ్రీధర్, మణికుమార్, శశి భూషణ్, రామన్ రాజేష్ పాల్గొన్నారు.

'ఎన్వీఎస్ బాబుసేవలు చిరస్మరణీయం'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాస్ యూనియన్ నాయకుడు ఎన్వీఎస్ బాబు సేవలు చిరస్మరణీయమని ఆ యూనియన్ గౌర అధ్యక్షుడు, ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు కొనియాడారు. ఎన్వీఎస్ బాబు ప్రథమ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్టీసీ కార్మికులకు బాబు అందించిన సేవలను కొనియాడారు. బాబు ప్రథమ వర్ధంతికి ఒక్కరోజు ముందే రాష్ట్ర ప్రభుత్వం ఆయన కుమారుడికి కారుణ్య నియామక ఉత్తర్వు ఇవ్వడం హర్షణీయమన్నారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ రాజువర్ధన్ రెడ్డి, యూనియన్ నాయకులు పసుపులేటి శ్రీనివాసకుమార్, ఆవుల ప్రభాకర్, ఆచారి పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : స్థానిక కళ్యాణవీరభద్ర స్వామి ఆలయంలో రెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్ వీల్ , ఆంధ్ర మహిళా మండలి సహకారంతో 37 మంది పేద వికలాంగులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్ర మహిళ మండలి గౌరవ అధ్యక్షురాలు డాక్టర్ రోహిణమ్మ పేర్కొన్నారు. మనపాటి విక్టోరియామ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు మనపాటి రవీంద్రబాబు 5 వేల రూపాయలు అందించారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు విష్ణు వందన, కార్యదర్శి లక్ష్మి, రెడ్ సంస్థ సభ్యులు జానా సుధీర్, పల్లం వెంకటేశ్వర్లు, మోదురు శ్రీనివాసఆచారి పాల్గొన్నారు.


విద్యుత్ సబ్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఏపీ టెక్నికల్ అండ్ హెచ్ఆర్‌డి ఎస్పీ డిసిఎల్ డైరెక్టర్

రైతులకు 9 గంటల విద్యుత్ సరఫరా చేయాలి

ఏపీ టెక్నికల్ అండ్ హెచ్ ఆర్డి ఎస్పీడీసీఎల్ డైరెక్టర్

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: రైతులకు 9గంటల విద్యుత్ పగటిపూట అంతరాయం లేకుండా నాణ్యమైన కరెంటును సరఫరా చేయాలని ఏపీ ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ టెక్నికల్ అండ్ హెచ్ ఆర్డి సుబ్బరాజు సిబ్బందిని సూచించారు. చిన్నగొట్టిగల్లు సబ్ స్టేషన్ను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏదైనా విద్యుత్ సమస్యలు వుంటే వినియోగదారులు టోల్ ఫ్రీ నెంబరు 1912 కు కాల్ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పలు ఫైళ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ఈఈ మునిచంద్ర, డిప్యూటీ ఈఈ శివయ్య, ఏఈ రెడ్డి ప్రదీప్, సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి: ఎంపిడివో

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: మధ్యాహ్న భోజనం రుచిగా, నాణ్యతగా పెట్టాలని ఎంపీడీవో సాయి లహరి పేర్కొన్నారు. మండలంలోని వెస్ట్ వరదయ్యపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీవో, ఎంఈవో రవీంద్రనాథ్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం మధ్యాహ్న భోజనం రుచిగా పెట్టడానికి నిధులు పెంచిందని, వంట నిర్వాహకులు రుచిగా వండిపెట్టాలన్నారు. విద్యార్థులకు భోజనాలు సక్రమంగా పెట్టకపోతే వంట నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైసిపి నాయకులను నిలదీసిన అంగన్వాడీలు

ప్రజాశక్తి-వెంకటగిరి: వైసిపి వెంకటగిరి నియోజకవర్గంలో సామాజిక సాధికార బస్సుయాత్రలో పాల్గొన్న వైసిపి నాయకులను అంగన్వాడీ కార్యకర్తలు నిలదీశారు. శుక్రవారం వెంకటగిరిపట్టణంలో సాగిన బస్సు యాత్ర పాతకోటలోని సెంటర్లో అంగన్వాడీ నిర్వహిస్తున్న సమ్మె శిబిరం వద్దకు చేరుకోగానే ఒక్కసారిగా అంగన్వాడీ కార్యకర్తలు బస్సును యాత్రలో పాల్గొన్న నాయకులను నిలదీశారు. స్పందించిన తిరుపతి పార్లమెంట్ సభ్యులు గురుమూర్తి వారిని సముదాయించడంతో బస్సును ముందుకు కదిలించారు. తమ సమ్మె చేపట్టి నెల రోజులు నుండి సాగుతున్న ప్రభుత్వం ఉలుకు...పలుకు లేకుండా ఉండడం సరికాదని నాయకులకు చెప్పడంతో తాము అధిష్టానం వద్దకు ఈసమస్యను తీసుకెళ్ళి సమస్యలు పరిష్కరించే విధంగా చొరవ చూపుతామని తెలపడంతో అంగన్వాడీ కార్యకర్తలు వెనక్కి తగ్గారు. ఈబస్సు యాత్రను అడ్డుకున్న వారిలో సీఐటీయు జిల్లా కమిటీ సభ్యులు వడ్డిపల్లి చెంగయ్య, ఏపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ వెంకటగిరి ప్రాజెక్టు అధ్యక్షురాలు మంజుల, కార్యకర్తలున్నారు.

అంగన్వాడీ కేంద్రాలకు బియ్యం చేరవేయాలి: తహశీల్దారు

ప్రజాశక్తి - బాలాయపల్లి: మండలంలోని 72 అంగన్వాడీ కేంద్రాలకు బియ్యం చేరవేయాల్సిన బాధ్యత వీఆర్ఓల పైనే వుందని తహశీల్దార్ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండల తహశీల్దారు కార్యాలయంలో అంగన్వాడీ కేంద్రాలకు బియ్యం చేరవేసేందుకు వీఆర్ఓలతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అంగన్వాడీ కేంద్రంలో మధ్యాహ్న పథకం భోజనం నిర్వహించేందుకు ప్రత్యేకమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రంలో బియ్యం కొరత లేకుండా చూసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లలు, గర్భవతులు బాలింతల్లో సంఖ్యను బట్టి వారికి అందించాల్సిన రేషన్ను వీఆర్ ఓలు బాధ్యతగా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ పూర్ణ, డిప్యూటీ తహశీల్దార్ శేషయ్య, వీఆర్ఓలు పాల్గొన్నారు.

మహిళా వర్సిటీ వైస్ ఛాన్సలర్‌కి 'సౌత్ జోన్ వైస్ ఛాన్సలర్స్ కాన్ఫరెన్స్'కు ఆహ్వానం

ప్రజాశక్తి - క్యాంపస్ : యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, ఏపి స్టేట్ ట్రైబల్ యూనివర్శిటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న సౌత్ జోన్ వైస్ ఛాన్సలర్స్ కాన్ఫరెన్స్ కి లీడ్ ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించవలసిందిగా మహిళా వర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య భారతికి ఆహ్వానం అందింది. ఈ కాన్ఫరెన్స్ లో జాతీయ విద్యా విధానం 2020 అమలు, పలు అంశాలపై చర్చలు జరగనున్నాయి. మహిళా వర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య భారతి పాలనా, సంయుక్త ప్రణాళిక అంశంపై ప్రసంగించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఎం జగదీశ్ కుమార్, నేషనల్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ చైర్మన్ పాల్గొన్నారు.

సర్పంచుల సంఘం అధ్యక్షునికి సన్మానం

ప్రజాశక్తి - ఏర్పేడు : ఏర్పేడు మండలంలోని సర్పంచుల సంఘం అధ్యక్షుడు నల్లపాలెం శివయ్యను ఏర్పేడు ఆటో యూనియన్ నాయకులు ఏర్పేడు గ్రామపంచాయతీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పూల మాల వేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. శ్రీ వెంకటేశ్వర ఆటో యూనియన్ లీడర్ కలిమెల్లు, నాగయ్య, సుబ్బయ్య నేతృత్వంలో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుబ్రమణ్యం వైసీపీ మండల నాయకులు నల్ల పాలెం పవన్ కుమార్ పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీలో నిరాశ

నామమాత్రంగా పంపిణీ

ప్రజాశక్తి- బుచ్చినాయుడుకండ్రిగ: వృద్ధులు, వికలాంగులు, వితంతు వులు కష్టాలు తీర్చాటానికి నిర్వ హించిన పింఛన్లు పంపిణీ నిరాశ మిగిల్చింది. మండలంలో ఆరు మాసాల వ్యవధిలో 147 మంది వితంతువులు, వికలాంగులు, వృద్ధులు, తదితరులు దరఖాస్తులు చేసుకున్నారు. వారందరూ జనవరిలో పంపిణీ చేసే నూతన పింఛన్ల కోసం ఆశగా ఎదురు చూశారు. కాని వారిలో ప్రభుత్వం 62 మందికి మాత్రమే పింఛన్లు మంజూరు చేసింది. అందులోనూ శుక్రవారం కేవలం 22 మందికి మాత్రమే నూతన పింఛన్లు మంజూరు చేసి మిగిలిన 40 మందికి డబ్బులు వచ్చిన వెంటనే పింఛన్లు అందిస్తామని ప్రస్తుతానికి మంజూరు పత్రం తీసుకుని ఇంటికి వెళ్లాలని ఆయా సచివాలయ సిబ్బంది నూతన పింఛను దారులకు సూచించారు. దీంతో వారంతా నిరాశగా వెనుతిరిగారు. మిగిలిన 85 మంది తమకు ఇప్పట్లో పింఛను రాదని తెలిసి ఆవేదన చెందారు. అర్హతలు ఉన్నా పింఛను రాలేదని ఇక ఎప్పటికి వస్తోందో కూడా తెలియని పరిస్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

చేతి బోరుకు మరమ్మతులు చేయరూ..?

- పట్టించుకోని అధికారులు - తాగునీటికి గ్రామస్తుల ఇక్కట్లు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలంలోని తడుకు పంచా యతీ తడుకు గ్రామంలో తాగునీటి చేతిబోరు మరమ్మతుకు గురైంది. బోరు చుట్టు పక్కల చెట్లు ముళ్ల పొదలు దట్టంగా పెరిగాయి. మరమ్మతులు చే యాలని గ్రామ ప్రజలు పలుసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా బోరుకు ఎలాంటి మరమ్మతులు చేయ కుండా వదిలేశారు. ఇప్ప టికైనా సంబంధిత అధికారులు స్పందించి బోరు చుట్టుపక్కల వు న్న చెట్లను తొలగించి ఉప యోగం లోకి తీసుకొచ్చి స్థానికు ల కు తాగునీటి కష్టాలు లేకుండా చేయాలని పలువురు కోరుతున్నారు.


మరమ్మతుకు గురై నిరుపయోగంగా వున్న చేతి బోరు

స్టడీ మెటీరియల్ వితరణ


స్టడీ మెటీరియల్ అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని పల్లమాల, నెలవాయి, కల్లివెట్టు ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పిల్లల సమక్షంలో బిఎన్‌కండ్రిగ మండల యుటిఎఫ్ నాయకులు పదవ తరగతి స్టడీ మెటీరియల్ ను అందించారు. జిల్లా ఆడిట్ కమిటీ సభ్యురాలు దీపిక మాట్లాడుతూ పేద మధ్యతరగతి విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని ప్రతి విద్యార్థి పాస్ అయ్యేలా 20 సంవత్సరాలుగా నిష్ణాతులైన ఉపాధ్యాయుల పర్య వేక్షణలో అన్ని సబ్జెక్టులకు సంబంధించి స్టడీ మెటీరియల్ రూపొందించామన్నారు. ఇందులో ప్రతి సంవత్సరం అన్ని సబ్జెక్టులలో 60 నుంచి 80 శాతంవరకు మార్కులు స్కోర్ చేస్తున్నారని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు కానుకగా అన్ని ఉన్నత పాఠశాలకు తెలుగు, ఇంగ్లీష్ మీడియం లో మెటీరియల్ అందిం చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ సభ్యురాలు దీపిక, అధ్యక్షులు ఈశ్వరయ్య, గౌరవాధ్యక్షులు రవీంద్రా రెడ్డి, ప్రధాన కార్యదర్శి గంటా రమేష్, కోశాధికారి సతీష్ కుమార్, మహిళా కార్యదర్శి జయంతి, జిల్లా కౌన్సిలర్ వాసుదేవరావు, మండల కార్యదర్శులు మురళీ ప్రసాద్, గిరిబాబు, నందిని, సీనియర్ నాయకులు జహంగీర్ పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

సెక్టార్ అధికారులకు ఆర్‌వో ఆదేశం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సెక్టారు అధికారులు అప్రమత్తంగా వుండాలని ఆర్‌వో కోదండరాం ఆదేశించారు. గూడూరు, వెంకటగిరి, సుళ్లూరు పేట నియో జకవర్గ ఎన్నికల్లో విధులు నిర్వహిం చనున్న సెక్టార్ ఆఫీసర్లకు వారి విధులపై గూడూరు డిఎన్ఆర్ కమ్యూనిటీ హాలులో శుక్రవారం ట్రైనింగ్ ప్రోగ్రాం రిట ర్నింగ్ ఆఫీసర్లు నిర్వ హించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ ఆఫీసర్ కోదండరాం మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో సెక్టార్ ఆఫీసర్లు అప్రమత్తంగా ఉండాలని ఒక్కొక్క ఆఫీసరికి 10 నుండి 12 పోలింగ్ కేంద్రాలు ఇస్తామన్నారు. ఎన్నికల్లో పాటించాల్సిన నియమ నిబంధనల గురించి ట్రైనింగ్ ప్రోగ్రాం లో తెలుపుతామని వీటిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్వోలు శ్రీనివాసులు, చంద్ర, ముని, తహశీల్దార్లు, సెక్టార్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

న్యాయ శాస్త్రంలో మంజువాణికి డాక్టరేట్



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం న్యాయ శాస్త్ర విభాగపు పరిశోధక విద్యార్థిని వి మంజువాణి కి డాక్టరేట్ ప్రదానం చేశారు. న్యాయశాస్త్ర విభాగపు ఆచా ర్యులు ప్రొఫెసర్ టి సీతా కుమారి పర్య వేక్షణలో 'ఇంపాక్ట్ ఆఫ్ క్లైమేట్ చేంజ్ ఆన్ పబ్లిక్ హెల్త్ ఇన్ ఇండియా – ఏ సోషియో లీగల్ స్టడీ' అనే అంశంపై పరి శోధన గ్రంథాన్ని వర్సిటీకి మంజువాణి సమర్పించడంతో డాక్టరేట్ ప్రదానం చేసినట్లు యూనివర్సిటీ అధికారులు తెలిపారు.

ట్రాన్స్ఫరబుల్ స్కిల్స్ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ఎం. ఉషా రాణి ఆధ్వర్యంలో డీన్, స్కూల్ ఆఫ్ సైన్సెస్, పి. సుజాతమ్మ అధ్యక్షతన శుక్రవారం డిపార్టుమెంట్ అఫ్ కంప్యూటర్ సైన్స్, ఏపీఎస్–ఎస్‌డిసి ల సంయుక్త ఆధ్వర్యంలో ఏడు రోజులపాటు నిర్వహించే ' ట్రాన్సఫరబుల్ స్కిల్స్' కార్యశాల ను ప్రారంభించారు. ఇందులో భాగంగా మహేంద్ర ప్రైడ్ క్లాసు రూమ్ ప్రాజెక్ట్ నాంది ఫౌండేషన్ గ్రూప్ శిక్షకులు వై రజని కుమారి, ఆయేషా షేక్, ఎంసీఏ విద్యార్థులకు 18 అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమానికి కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు, విద్యార్థులు హాజరయ్యారు.

మరోసారి పేదల ప్రభుత్వానికి అవకాశం ఇవ్వండి: అలీ


బస్సు యాత్రలో పాల్గొన్న సినీనటుడు అలీ

ప్రజాశక్తి-వెంకటగిరి: మరోసారి పేదల ప్రభుత్వానికి అవకాశం కల్పించాలని సినీనటుడు అలీ కోరారు. శుక్రవారం వెంకటగిరి నియోజకవర్గంలో వైసిపి నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్రలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈబస్సు యాత్ర వెంకటగిరి నేదురుమల్లి నివాసం నుండి ర్యాలీగా వెంకటగిరిలోని కాశీపేట, పాలకేంద్రం మీదుగా డక్కిలి మీదుగా రాపూరుకు చేరుకుంది. డక్కిలిలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన ఘనత ఒక్క జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఎక్కడా అమలు సంక్షేమ పథకాలను ఆంధ్రప్రదేశ్ అమలు చేసి చూపించిన పార్టీ వైసిపి యేనని కొనియాడారు. మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఈప్రాంత ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉన్న నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి అవకాశం కల్పించాలన్నారు. ఈ బస్సు యాత్రలో వెంటగిరి నియోజకవర్గ సమన్వకర్త నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి, తిరుపతి పార్లమెంట్ సభ్యులు గురుమూర్తి, సూళురుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, వెంకటగిరి రాజ కుటుంబీకులు సర్వజ్ఞకుమార యాచేంద్ర పాల్గొన్నారు.

పాలకుల్లో కదలిక

కల్వర్టు నిర్మాణం ప్రారంభం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోని మంగళం గ్రామ పంచాయతీ, బిటిఆర్ కాలనీ ఒకటో లైన్ నుండి తిరుమల నగర్ ప్రధాన మార్గాన్ని కలుపుతూ కల్వర్టు నిర్మాణం చేయాలని 2022 డిసెంబరులో అధికారులు అంచనాలు రూపొందించారు. అయితే ఇన్ని రోజులుగా కల్వర్టు నిర్మాణం పనులు చేపట్టకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటనే కల్వర్టు నిర్మాణ పనులు ప్రారంభించాలని గతంలో 'ప్రజాశక్తి' పలు కథనాలను ప్రచురించింది. దీనిపై ప్రతిపక్ష టీడీపీ నాయకులు సైతం గ్రామ సభల్లో పాలకులను నిలదీశారు. స్పందించిన పాలకులు కల్వర్టు నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. శుక్రవారం కాలువ నీటిని మళ్లించే పనులు ప్రారంభించారు. దీనిపై ప్రతిపక్ష టిడిపి నాయకులు, స్థానిక ప్రజలు విశాలమైన కల్వర్టు నిర్మించినప్పుడే ప్రకృతి విపత్తులకు తట్టుకొని ఉంటుందని, ఇందుకు అనుగుణంగా కల్వర్టు నిర్మాణం చేయాలని, లేకుంటే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. అధికారులతో సంప్రదించి అందరికీ ఆమోద యోగ్యమైన కల్వర్టు నిర్మాణం చేపడతామని సర్పంచి భర్త గంగారపు వరలక్ష్మిరాంబాబు హామీ ఇచ్చారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'కు విశేష స్పందన: ఎమ్మెల్యే

ప్రజాశక్తి- పిచ్చాటూరు: జగనన్న ఆరోగ్య సురక్ష –2కు విశేష స్పందన లభించిందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. పిచ్చాటూరు మండలం ముడియూర్‌లో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష –2ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల ఆరోగ్య విషయంలో శ్రద్ధ వహించి గత ప్రభుత్వం కన్నా ఆరోగ్యశ్రీ ద్వారా 25 లక్ష రూపాయలు పెంచి పేద మధ్యతరగతి కుటుంబాలకు కార్పొరేట్ ఆధునిక ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకునే సౌకర్యం కల్పించే అవకాశం కల్పించారన్నారు. ఈ కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు డాక్టర్ అహ్మద్ కంటి అద్దంతో పాటు వైద్య పరీక్షలు చేయించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు కే చలపతి రాజు, రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ నాయుడు, మండల ఉపాధ్యక్షుడు రమేష్ రాజు, సుబ్రమణ్యం రెడ్డి, ఎంపీటీసీ రాఘవమ్మ, పాల పద్మనాభం , మోహన్ బాబు రెడ్డి, చంద్రన్, త్యాగరాజులు, ఎంపీడీవో శ్రీనివాసులు, తహశీల్దారు మధుసూదన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికే పెరటి కోళ్లు పంపిణీ: ఎంపీడీవో


మహిళలకు పెరటి కోళ్లు పంపిణీ చేస్తున్న ఎంపిడివో

ప్రజాశక్తి -తొట్టంబేడు: మహిళలు ఆర్థికాభివృద్ధికే పెరటి కోళ్లను పంపిణీ చేశామని తొట్టంబేడు ఎంపీడీవో కే సురేష్ బాబు తెలిపారు. తొట్టంబేడు మండల సమాఖ్య ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు 60 యూనిట్ల పెరటి కోళ్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా పరి పుష్టి చేయడానికి ప్రభుత్వం అనేక రకాల పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. పెరటి కోళ్ల పెంపకం వల్ల మహిళలు ఆర్థికంగా ముందుకు పోవచ్చన్నారు. వెరైటీ కోళ్లు పెట్టే కోడిగుడ్డులు తినడం వల్ల మహిళల్లో రక్తహీనత, హనీ మియా వంటి వ్యాధులకు దూరం కావచ్చని చెప్పారు. మహిళలు ప్రభుత్వం ఇస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఏరియా కోఆర్డినేటర్ టి ధనంజయ రెడ్డి, ఏపీఎం పి గురుమూర్తి , కమ్యూనిటీ కోఆర్డినేటర్లు రేవతి, దుర్గా, శ్రీనివాసులు , వెంకటేశ్వర్లు, పురుషోత్తం, మంగయ్య, అకౌంటెంట్ సరిత, మహిళ సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

జనసేనలోకి కాణిపాకం ఆలయ మాజీ ఛైర్మన్ రాజకుమార్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): జనసేనలో కాణిపాకం ఆలయ మాజీ ఛైర్మన్ రాజకుమార్ చేరారు. శుక్రవారం తిరుపతి జనసేన పిఏసి కార్యాలయంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్, రాజకుమార్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరి ప్రసాద్ మాట్లాడుతూ జనసేన సిద్ధాంతాలు, పవన్ కల్యాణ్ ఆలోచనలకు ఆకర్షితులై అనేక మంది పార్టీలో చేరుతున్నారన్నారు. పార్టీ సిద్ధాంతాలను క్షేత్రస్థాయిలోకి తీసుకువెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయాలని రాజకుమార్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా కార్యదర్శి భాను ప్రసాద్ , బాటసారి, తిరుపతి నగర ఉపాధ్యక్షులు పార్థు, తిరుపతి నగర కార్యదర్శి కిరణ్ కుమార్, మనోజ్ కుమార్, గౌస్ భాష, మోహిత్, ఇంద్ర పాల్గొన్నారు.

ఎస్‌వియు ఉపకులపతికి ఘన సత్కారం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): నూతనంగా శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతిగా నియమితులైన శ్రీకాంత్ రెడ్డిని శుక్రవారం తిరుపతి నగర పరిధిలోని ఎమరాల్డ్స్ విద్యా సంస్థల సంచాలకులు గిరిధర్, విశ్వనాధ్ కలసి ఘనంగా సత్కరించారు. ఎంతో మంది మేధావులను సమాజానికి అందించిన శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంకు ఉపకులపతిగా శ్రీకాంత్ రెడ్డి నియమితులవడం హర్షించదగ్గ విషయమని ఎమరాల్డ్స్ డైరెక్టర్లు చెప్పారు. శ్రీకాంత్ రెడ్డి హాయంలో వర్సిటీ మరింత ఖ్యాతిని గడించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామన్నారు. ఈ సత్కార కార్యక్రమంలో ఎమరాల్డ్స్ విద్యాసంస్థల ఉప సంచాలకులు పాల్గొన్నారు.

గ్యాస్ పైప్ లైన్‌కు డామేజ్

కారకులైన జేసీబీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ముందస్తు సమాచారం ఇవ్వకుండా, ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకుండా గ్యాస్ పైప్ లైన్ లీకేజీకి కారణమైన జెసిబి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌కు అధీకృత సంస్థ ఏజి అండ్ ప్రథమ్, ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాయుడుపేట సమీపంలోని మేనకూరు, అత్తివరం వద్ద గృహ, పారిశ్రామిక, వాణిజ్య, రవాణా వినియోగదారులకు పైప్డ్ నేచురల్ గ్యాస్ (పిఎన్ జి), కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (సిఎన్జి) సరఫరా చేయడానికి నాయుడుపేటలోని పారిశ్రామిక పార్కులలో పైప్‌లైన్ మౌలిక సదుపాయాలను కంపెనీ ఏర్పాటు చేసింది. ఈ గ్యాస్ పైప్‌లైన్ మౌలిక సదుపాయాలు, సంబంధిత ప్రభుత్వ అధికారుల నుండి అనుమతులు సైతం తీసుకున్నారు. ఈనెల 4వ తేదీ ఏపి –07– సిఆర్ –1719 రిజిస్ట్రేషన్ నంబర్ గల జేసీబీ ద్వారా స్థానికులు గ్యాస్ పైప్ లైన్ వెళ్లే ప్రాంతంలో తవ్వకాలు జరిపారు. ఈ సమయంలో తీవ్ర నష్టం వాటిల్లింది. పైప్ లైన్ సంబంధిత గుర్తులు, హెచ్చరిక సంకేతాలు, అత్యవసర సమాచార బోర్డు ఉన్నప్పటికీ పట్టించుకోకుండా, సంబంధిత కంపెనీకి ముందస్తు సమాచారం ఇవ్వకుండా తవ్వకాలు చేపట్టడంతో పైపులైన్ లీకేజ్ కి దారి తీసింది. వెంటనే స్పందించిన కంపెనీ సిబ్బంది గ్యాస్ సరఫరాను ఆపేయడంతో భారీ ప్రమాదం తప్పింది. పైప్ లైన్ లీకేజ్ కు కారణమైన జెసిబి యాజమాన్యంపై కంపెనీ ప్రతి నిధులు శుక్రవారం నాయుడుపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందుకు కారణం అయిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కంపెనీ ప్రతినిధులు పోలీసు లను కోరారు.

చేనేత రంగాన్ని ఆదుకుందాం: మిద్దెల హరి


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న హరి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: చేనేత రంగాన్ని ఆదుకుం దామని మాజీ ఆప్కో డైరెక్టర్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మిద్దెల హరి పిలుపునిచ్చారు. చేనేత కార్మిక యూనియన్ నూతన సంవత్సర క్యాలెండర్ ను శుక్రవారం మిద్దెల హరి ఆవిష్కరించారు. చేనేత కార్మికులు ఐక్యమత్యంతో చేనేత రంగ సంరక్షణను, సంక్షేమాన్ని సాధించుకోవాలని కోరారు. కార్మిక యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఆకుల వాసు, వెంకటముని, షణ్ముగ వర్మ పాల్గొన్నారు.

బొజ్జల సుధీర్ రెడ్డి ఆరోపణలు సిగ్గుచేటు: వైసిపి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : యానాదులకు ఉండడానికి గూడు నిర్మించాలని చూస్తే ఎమ్మెల్యేపై బొజ్జల సుధీర్ రెడ్డి కబ్జా ఆరోపణలు చేయడం సిగ్గుచేటని వైసీపీ నేతలు విమర్శించారు. అది కూడా చెంచులక్ష్మి కాలనీలో కబ్జాలకు పాల్పడ్డ ఓ దళిత నాయకుని వెంటబెట్టుకుని సుధీర్ రెడ్డి నానా యాగి చేయడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. స్థానిక చెంచులక్ష్మి కాలనీ వద్ద శుక్రవారం వైసీపీ నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. 12 సంవత్సరాలుగా తాము బాడుగ ఇళ్లల్లోనే మగ్గుతున్నామనీ, ఓ దళిత నాయకుడు చెంచులక్ష్మి కాలనీలో ఆక్రమణకు దిగుతున్నాడని ఆ కాలనీ మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొస్తే, వారికి అక్కడ ఇళు నిర్మించి ఇవ్వాలని ఎమ్మెల్యే ఆదేశించారని నాయకులు తెలిపారు. ఈ క్రమంలో ఆ స్థలాన్ని యానాదులు చదును చేస్తే ఓర్వలేని బొజ్జల సుధీర్ రెడ్డి ఎమ్మెల్యే పై, ఆయన అనుచరులపై కబ్జా చేస్తున్నారంటూ ఆరోపణలు చేయడం వింతగా ఉందని చెప్పారు. ఎమ్మెల్యే పై కబ్జా ఆరోపణ చేసిన సుధీర్ రెడ్డి పై యానాదులే తిరగబడి తగిన సమాధానం చెప్పారని వివరించారు. ఇప్పటికైనా బొజ్జల సుధీర్ రెడ్డి చౌకబారు రాజకీయాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. వైసీపీ నేతలు గోరా పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి -ఏర్పేడు: ఏర్పేడు మండలంలోని చిందేపల్లి గ్రామపంచాయతీలో కొద్దిరోజుల క్రితం అనేక కారణాల వల్ల మరణించిన మృతుల కుటుంబాలకు శ్రీకాళహస్తి శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమారుడు బియ్యపు ఆకర్ష రెడ్డి ఒక్కొక్కరికి పదివేల రూపాయలు చొప్పున అందించారు. ఈ కార్యక్రమంలోచిందేపల్లి సర్పంచ్ చెన్నూరు పెంచలయ్య, వైసిపి నాయకులు, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

'బీస్' డైరీ ఆవిష్కరణ


డైరీని ఆవిష్కరిస్తున్న బలిజ ఉద్యోగుల సంఘం నాయకులు

ప్రజాశక్తి -తిరుపతి: ఉమ్మడి చిత్తూరు జిల్లా బలిజ ఉద్యోగుల అభ్యుదయ సేవా సమితి(బీస్) డైరీ ఆవిష్కరణ శుక్రవారం రాత్రి తిరుపతిలోని యూత్ హాస్టల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీస్ కార్యవర్గ అధ్యక్షులు నీలం నరేంద్రనాథ్, కార్యదర్శి తోకల అశోక్ కుమార్, నెల్లూరు బీచ్ ఫౌండర్ పి. అనిల్ కుమార్ మాట్లాడుతూ వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల పరస్పర సహకారమే బీస్ ధ్యేయమని తెలిపారు. బీస్ అభ్యున్నతికి బలిజ ఉద్యోగులు తమ వంతు సహకారాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీస్ ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, రవి కుమార్, అమర్ బాబు, లక్ష్మీ ప్రసాద్, ప్రసాద్, చంద్రశేఖర్, శ్రీలక్ష్మి, సత్యనారాయణ, ముని శంకరయ్య, బాలాజీ, మధుసూధన్, జయ ప్రకాష్, శివ కుమార్, మురళి, వర ప్రసాద్, మోహన్, సురేష్, నర్సింహులు, శ్రీనివాసులు, భాస్కర్, ప్రకాష్, కిషోర్, వివిధ విభాగాల్లో పనిచేస్తున్న బలిజ ఉద్యోగులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్టు


పోలీసుల అదుపులో నిందితులు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: గంజాయి అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులు అదుపులో తీసుకున్నట్లు ఈస్ట్ సీఐ మహేశ్వర్ రెడ్డి తెలిపారు. స్థానిక ఈస్ట్ పోలీస్ స్టేషన్ లో శుక్రవారం అయిన విలేకరులతో మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాలతో రోజువారి తనిఖీల్లో భాగంగా రేణిగుంట రోడ్డు ఫ్లైఓవర్ పోస్టల్ కాలనీ క్రాస్ వద్ద ఫుట్ పెట్రోలింగ్ చేపట్టామన్నారు. అక్కడ అనుమానంతో తిరుగుతున్న ఇద్దరు నిందితులను అదుపులో తీసుకొని విచారించిగా, వారి వద్ద 5 కేజీల గంజాయి లభించిందన్నారు. వెంటనే అప్రమత్తమై వారిని అదుపులోకి తీసుకుని విచారించగా సూళ్లూరుపేట తానేలి గ్రామానికి చెందిన సాయి కృష్ణ, ప్రస్తుతం గ్రాండ్ వరల్డ్ సమీపంలోని ఎస్ఎల్వీ నగర్ లో కాపురం ఉంటున్నాడు, చిత్తూరు జిల్లా బంగారుపాలెం మండలం రాగిమోను పెంట గ్రామానికి చెందిన ముని చర్ల సాయి, ప్రస్తుతం తిరుపతి రూరల్ పంచాయతీలో కాపురం ఉంటున్నారు. వీరిద్దరూ కలిసి పాడేరు నుంచి ఈ గంజాయిని కొనుగోలు చేసి నగరానికి తెచ్చి చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారుచేసి తిరుపతి నగరం చుట్టుపక్కల ప్రాంతాలలో విక్రయిస్తున్నట్లు అంగీకరించారన్నారు. వీరి ఇరువురిపై ఎన్.డి.పి.ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఈస్ట్ సీఐ తెలిపారు.

కోడి పందేల రాయుళ్ల అరెస్టు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతి రూరల్ ప్రాంతంలో కోడిపందేలు ఆడుతున్న 17 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జిల్లా ఎస్పీ పి పరమేశ్వర రెడ్డి సూచనల మేరకు, స్పెషల్ ఇన్ఫోర్స్‌మెంట్ బ్యూరో ఏఎస్పీ ఏ రాజేంద్ర ఆదేశాలతో ఇంటెలిజెన్స్ వింగ్, తిరుపతి , సెబ్ స్టేషన్ తిరుపతి రూరల్ డిటిఎఫ్ తిరుపతి సామూహికంగా తమకు వచ్చిన సమాచారం మేరకు శుక్రవారం దాడులు నిర్వహించారు. కుంట్రపాకం పంచాయితీ పరిధిలో 17 మంది వ్యక్తులు కోడిపందేలు ఆడుతు సెబ్ అధికారులకు చిక్కారు, వారి నుండి 5 కోళ్లు , రూ.32,960 నగదు, 15 మొబైల్స్ స్వాధీనం చేసుకుని, వారిని తిరుచానూరు పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తిరుపతి జిల్లా కోర్టుకు హాజరైన సుబ్రహ్మణ్యస్వామి

ఆంధ్రజ్యోతి కేసు ఫిబ్రవరికి వాయిదా

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ఆంధ్రజ్యోతి దినపత్రిక పై టీటీడీ వేసిన కేసును వాదించేందుకు బిజెపి మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యా స్వామి శుక్రవారం తిరుపతి జిల్లా కోర్టుకు హాజరయ్యారు. కోర్టు విచారణను ఫిబ్రవరి 5వ తేదీకి వాయిదా వేసింది. టీటీడీ వెబ్ సైట్ లో అన్యమత ప్రచారం చేస్తున్నారని గతంలో ఆంధ్రజ్యోతి దినపత్రిక ప్రచురించడంతో దీనిపై టీటీడీ కోర్టులో కేసు వేసింది. స్పందించిన ఎంపీ సుబ్రహ్మణ్యం స్వామి ఆంధ్రజ్యోతి దినపత్రికపై వందకోట్ల పరువు నష్టం దావా కేసు దాఖలు చేసిన విషయం విదితమే. కేసు విచారణలో భాగంగా కోర్టుకు హాజరై టీటీడీ జత చేసిన పత్రాలను సుబ్రహ్మణ్యా స్వామి పరిశీలించారు. కానీ న్యాయవాదుల సమ్మె కారణంగా కేసు విచారణ ఫిబ్రవరి 5 తేదీకి వాయిదా పడింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను రిజిస్టర్ న్యాయవాది కానందున కేసులు వాదించేందుకు జడ్జి అంగీకరించలేదని, హై కోర్టు ద్వారా ప్రత్యేక ఉత్తర్వులు తీసుకు వచ్చానని, కేసులో వాదనలు వినిపించేందుకు వచ్చానని కానీ న్యాయవాదుల సమ్మె కారణంగా కేసు వాయిదా పడిందని తెలిపారు. టీటీడీ ప్రతిష్ట దెబ్బ తీసేందుకు అసత్య వార్తను ప్రచురించారు. దేవస్థానం అన్ని ఆధారాలు కోర్టుకు సమర్పించిందని తెలిపారు.


ప్రమాదానికి గురైన లారీ, బస్సు

లారీ, బస్సుఢీ

ఇద్దరు మృతి

ప్రజాశక్తి -పెళ్లకూరు: పెళ్లకూరు మండలంలోని కొత్తూరు గ్రామం వద్ద నేషనల్ హైవే పై శుక్రవారం ఉదయం లారీ, బస్సు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు మృతి చెందగా మరో నలుగురికి గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న ఎస్సై శ్రీకాంత్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని గాయాలైన వారిని హుటాహుటిన చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. చత్తీస్‌ఘడ్ నుండి తిరుపతి వైపు వెళుతున్న గుప్తా ట్రావెల్స్ బస్సు వేలూరు నుంచి నెల్లూరు వైపు వెళుతున్న కంకర్ లోడ్ లారీ ఎదురెదురుగా ఢీకొనడతో బస్ డ్రైవర్ దినిష్ ప్రతాప్ సింగ్ (48) అక్కడికక్కడే మృతి చెందాడు. లారీ డ్రైవర్ రెండు వాహనాల మధ్య ఇరుక్కు పోవడంతో ఒక కాలు పూర్తిగా కట్ అయ్యింది. అతడిని క్రేన్ సహాయంతో బయటికి తీసి 108 ద్వారా నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స తీసుకుంటుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. లారీ డ్రైవర్ విల్లుపురానికి చెందిన ఇలగ వరణ్ (43) అని గుర్తించారు. ఇతనికి భార్య, ముగ్గురు పిల్లలు మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.